క్లుప్తంగా

లచ్చన్నపాలెంలో వైభవంగా హోమాలు


హోమాల్లో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని లచ్చన్నపాలెంలో ప్రత్యేక హోమాలు, పూజలు వైభవంగా నిర్వహించారు. గురువారం హనుమాన్ జయంతి కావడంతో మండలంలోని లచ్చన్నపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పిల్లలు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జయంతి సందర్భంగా గురువారం మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రికి గ్రామంలో హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పారిశుధ్య పనుల తనిఖీ

మాడుగుల: గ్రామాల్లో పారిశుధ్య పనులను ఎంపీడీవో కొంకి అప్పారావు బుధవారం తనిఖీ చేశారు. ఆయన గాదిరాయి, సత్యవరం గ్రామాల్లో పర్యటించారు. మంచి నీటి పథకాలు శుభ్రపరిచి క్లోరినేషన్ సక్రమంగా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా వేసేలా ప్రతి ఇంటి వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. పరిసరాల పరిశుభ్రత ద్వారా రానున్న సీజన్‌లో జ్వరాలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవ్యశ్రీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా

గొలుగొండ: అనారోగ్యం కారణంగా వైఎస్సార్‌సీపీ గొలుగొండ మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను కలిసి బుధవారం అందజేసారు. వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్తగా పని చేస్తానని తెలిపారు.

ఆశాజకనంగా నువ్వు పంట


పూత పంట దశలో నువ్వు చేను

నాతవరం : మండలంలో ఈఏడాది నువ్వు పంట ఆశాజకంగా ఉంది. గత ఏడాదితో పోల్చుకుంటే నువ్వు పంట సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంది. మండల వ్యాప్తంగా 922 ఎకరాల్లో నువ్వులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం నువ్వు చేను పూత దశలో ఉండగా కొన్ని చోట్ల పంట దశలోకి చేరువలో ఉంది. నువ్వుల ధర కూడా మార్కెట్లో 100 కేజీల బస్తా రూ.10వేలకు పైగా పలుకుతుంది. నెల రోజుల వ్యవధిలో నువ్వు పంట చేతికందే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. నువ్వు పంట దిగుబడి బాగుంటే మంచి ఆదాయంతో ఖరీఫ్ సాగు పెట్టుబడి కోసం ఉపయోగపడుతుందని రైతులు ఆశిస్తున్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళులు


రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ తదితరులు

నర్సీపట్నం : దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అబిద్‌సెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు నంగిన వెంకట రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రధానిగా రాజీవ్ గాంధీ ఎనలేని సేవలు అందించారని రమణ కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ ముత్యాలు సాంబశివరావు, రాజాన రాజు, అధికారి చిన్నిలు, నాయుడు, సిద్ధ, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి ప్రత్యేక ఏర్పాట్లు


హనుమాన్ దీక్షలు చేస్తున్న భక్తులు

రావికమతం : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మత్స్యవానిపాలెం, కొత్తకోట గ్రామాల్లో ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు. మత్స్యవానిపాలెంలో పలువురు భక్తులు ఆంజనేయస్వా మి మాలాధారణ చేసి దీక్షలు చేపట్టారు. గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, రామభజనలు ఏర్పాటు చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.
నాతవరం: అంజనేయస్వామి జయంతి పురస్కరించుకుని స్వామి వారి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అంధకారంలో తాండవ

- ప్రాజెక్టుపై స్పిల్‌వే గేట్ల వద్ద వెలగని విద్యుత్ లైట్లు
- మరమ్మతులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- స్పందించకుంటే తుఫాన్ల సమయంలో తాండవకు పొంచి ఉన్న ముప్పు
- రాత్రిపూట చిమ్మచీకట్లోనే సిబ్బంది పర్యవేక్షణ


తాండవ ప్రాజెక్టుపై అలంకారప్రాయంగా లైట్లు


స్పిల్‌వే గేట్లపై వెలగని విద్యుత్ లైట్లు


తాండవ ప్రాజెక్టుపై కుండీలలో కన్పించని మొక్కలు

నాతవరం : కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా తాండవ రిజర్వాయరు అంధకారంలో కాలం వెళ్లదీస్తుంది. ఉమ్మడి జిల్లాలోనే ఏకై క మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయరు. దీనిపై ఆధారపడి కాకినాడ అనకాపల్లి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 52వేల ఎకరాలు ఆయకట్టు ఉంది. రిజర్వాయరు స్పిల్‌వే గేట్ల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు శిథిలమై నెలలు గడుస్తున్నా కనీసం పట్టించుకునే వారు లేరు. ఒకప్పుడు ప్రాజక్టు స్పిల్‌వే గేట్ల వద్ద సాయంత్రం అయ్యేసరికి పట్టపగలు తలపించేలా విద్యుత్ కాంతులు విరజిమ్మేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక లైట్ల మరమ్మతులను గాలికి వదిలేసింది. తాండవ ప్రాజెక్టు రెండు కొండల నడుమ దట్టమైన అటవీప్రాంతాన్ని తలపించే ప్రదేశంలో నిర్మించారు. ప్రాజెక్టు ప్రమాద స్థాయి నీటి మట్టాన్ని తగ్గించేందుకు తాండవ నదిలోకి నీటిని విడుదల చేసేందుకు స్పిల్‌వే గేట్లు రెండు కొండలను చీల్చి నిర్మించారు. ఈ ప్రాంతానికి కొత్త వారు పట్టపగలు కూడా ఒంటరిగా వెళ్లడానికి భయపడతారు. తాండవ ప్రాజెక్టుతో పాటు స్పిల్‌వే గేట్లపై ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు చాలా కాలంగా పూర్తిగా శిథిలమయ్యాయి. పొద్దుపోతే ప్రాజెక్టుపై స్పిల్‌వే గేట్ల వద్ద మచ్చుకైనా ఒక్క లైటు వెలగడం లేదు. సాయంత్రం అయితే తాండవ ప్రాజెక్టు అంతా అంధకారంలో ఉండడంతో ఏ సమయంలో ఏప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రెండు జిల్లాలు నలు మూలల నుంచి నిత్యం సందర్శకులు తాండవ ప్రాజెక్టను చూసేందుకు వస్తుంటారు. సాయంత్రం అయ్యేసరికి తాండవ అంధకారంలో ఉండడంతో భయపడి ముందుగానే అక్కడి నుంచి సందర్శకులు వెళ్లిపోతున్నారు. విద్యుత్ లైట్లు వెలిగితే కొంతమంది చీకటి పడినప్పుడు కొంతసేపు కాలక్షేపం చేసేవారు. విద్యుత్ లైటింగ్ లేక తాండవ ప్రాజెక్టుపై రాత్రి సమయంలో డ్యూటీ చేసే సిబ్బంది సైతం అక్కడ ఉండేందుకు భయపడి వచ్చేసి తెల్లవారునే వెళ్తున్నారు. వర్షాలు పడి తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం పెరిగితే రాత్రి వేళల్లో సెల్ లైటింగ్‌లోనే ప్రమాదస్థాయి నీటి మట్టం చూసుకునే పరిస్థితి ఉంటుంది. స్పిల్‌వే గేట్లు వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. సందర్శకులను ఆకట్టుకునే విధంగా తాండవ ప్రాజెక్టుపై కుండీలు ఏర్పాటు చేసి పలు మొక్కలు గతంలో పెంచేవారు. వాటిని సైతం కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో మొక్కలన్నీ నాశనమైపోయాయి. కుండీలలో చూసేందుకు ఒక్క మొక్క కూడా కన్పించలేదు. కుండీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఒకపక్క కనుచూపుమేర తాండవ ప్రాజెక్టులో నీరు మరో పక్క ప్రాజెక్టు గట్టుపై సర్వాంగసుందరంగా తయారు చేసిన పచ్చని మొక్కలు నడుమ సందర్శకులు సరదగా గడిపేవారు. ప్రస్తుతం తాండవలో ఆ వాతావరణం కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాండవ ప్రాజెక్టు కమిటీకి ఎన్నికలు నిర్వహించేందుకు చూపించిన శ్రద్ధ శిథిలమైన లైట్లు మరమ్మతులకు ఆసక్తి చూపకపోవడం బాధాకరమైన రైతులు చెబుతున్నారు. విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయకపోతే తుఫాన్ల సమయంలో సరైన పర్యవేక్షణ కొరవడి తాండవ ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉంటుందని ఆయకట్టుదారులు అంటున్నారు. ఈ విషయంపై తాండవ ప్రాజెక్టు జెఈ ప్రేమ్‌కుమార్‌ని సంప్రదించగా విద్యుత్ లైట్ల మరమ్మతులు, ప్రాజెక్టు ప్రధాన సమస్యలు పరిష్కారించేందుకు రూ.12లక్షలు నిధులకు ప్రతిపాదనలు చేశామని, ఈ సమస్యను ఈఈ బాలసూర్యం దృష్టిలో ఉంచామని తెలిపారు. నిధులు విడుదలైతే పనులు చేపడతామన్నారు.

స్పీకర్ ఆదేశాలు అమలు కాలేదు



తాండవ ప్రాజెక్టుపై విద్యుత్ లైట్లు, నాశనమైన మొక్కలు మార్చి నాటికి వేస్తామని ప్రాజెక్టు అధికారులు చెప్పారు. కానీ ఇంతవరకూ ఎటువంటి పనులు చేపట్టలేదు. వేసవిలో తాండవ ప్రాజెక్టుకు సంబంధించి సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. కానీ ఇపుడు నిధులు లేవని చెబుతున్నారు. గత నెలలో స్పీకరు అయ్యన్నపాత్రుడు మండలంలో మర్రిపాలెం పర్యటనకు వచ్చినప్పుడు ఖరీఫ్ సీజన్ వచ్చేస్తుంది.. తాండవ లీకేజీలు, ఇతర పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కానీ ఇప్పటి వరకూ ఆయన ఆదేశాలు అమలు కాలేదు.
– షేక్ రజాక్, మండల కోఆప్షన్ సభ్యుడు తాండవ

నిర్లక్ష్యం తగదు



ఎన్నికల ముందు చెప్పిన దానికి ఇప్పుడు చేస్తున్న దానికి చాలా తేడా ఉంది..తాండవ ప్రాజెక్టును ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సభలో పెద్దలు గొప్పలు చెబుతున్నారు.. క్షేత్ర స్థాయిలో మాత్రం ఆ దిశగా పనులు జరగడం లేదు. రైతులకు, సందర్శకులకు ఉపయోగపడే తాండవ రిజర్వాయరును పూర్తిగా నిర్ల క్ష్యం చేసేశారు.
– బాలేపల్లి వెంకటరమణ, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి

రాజాంలో ఆర్మీ జవాన్‌కు సత్కారం


రాజాంలో ఆర్మీ జవాన్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట : మండలంలో గల రాజాం గ్రామంలో ఆర్మీ జవాన్ నడిపల్లి అశోక్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. బుధవారం జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని ఆకుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆర్మీ జవాన్‌ను సత్కరించారు. ఇటీవల పాకిస్తాన్ యుద్ధం చేసిన బోర్డర్ దగ్గరలోనే అశోక్ విధులు నిర్వహిస్తున్నాడు. గత నాలుగేళ్లుగా జమ్ముకాశ్మీర్, శ్రీనగర్ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అశోక్ మంగళవారం రాత్రి స్వ గ్రామం రాజాం చేరుకున్నాడు. దేశ సేవలో పాల్గొంటున్న అశోక్‌ను జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గ్రామ యువకులు ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. పహల్గాంపై పాకిస్తాన్ దాడి చేసి టూరిస్టులను పొట్టన పెట్టుకోవడం పిరికి పంద చర్య అని, భారతదేశాన్ని కాపాడుకోవడానికి శక్తివంచన లేకుండా పోరాటాలు చేస్తామని జవాన్ అశోక్ తెలిపారు. జై జవాన్ , జై కిసాన్ అంటూ యువకులు గ్రామంలో నినాదాలు చేశారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై జెడ్పీ సీఈవో విచారణ

మాకవరపాలెం : పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై జడ్పీ సీఈవో విచారణ చేశారు. మండల కేంద్రంలోని బస్టాండు ఎదురుగా ఉన్న మండల పరిషత్ షాపులకు వేలం నిర్వహించాలని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టర్ ఆదేశాలతో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదుదారైన ఫ్రాన్సిస్ సమక్షంలో విచారణ చేపట్టారు. ప్రస్తుతం షాపులకు సంబంధించి అద్దెల వివరాలు తెలుసుకున్నారు. నిబంధనల మేరకు షాపులకు వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఈ విచారణలో ఎంపీడీవో ఛాయాసుధ, ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

కొనసాగుతున్న విజ్ఞాన శిబిరాలు


విద్యార్థులతో బుక్ రీడింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి పద్మావతి


పుస్తక పఠనం ఉపయోగాల గురించి వివరిస్తున్న విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కె.కోటపాడు : వేసవి విజ్ఞాన శిబిరంతో విద్యార్థులలో జ్ఞాపకశక్తి మెరుగు పడుతుందని చౌడువాడ శాఖా గ్రంథాలయాదికారిణి ఎం.పద్మావతి అన్నారు. చౌడువాడ గ్రంథాలయం వద్ద బుధవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో నీతి కథలు చదివించడం, చైర్ గేమ్స్ నిర్వహించారు. జూన్ 6 వరకూ విజ్ఞాన శిబిరం నిర్వహిస్తామని పద్మావతి తెలిపారు.
నర్సీపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులతో మాస్ రీడింగ్ చేయించారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలను గ్రంథాలయ అధికారి పి.దమయంతి విద్యార్థులకు వివరించారు. అనంతరం విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ పుస్తకాల వల్ల కలిగే ప్రయోజనాలు కథల రూపంలో విద్యార్థులకు వివరించారు. ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి గురించి విద్యార్థులకు వివరించారు. దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మన దేశంలో తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా పాటిస్తారన్నారు. విద్యార్థులతో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

చీడికాడ: చీడికాడ శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ ఓరియెంటేషన్ క్లాసుల్లో బుధవారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. కథలు చదివి వినిపించారు. పుస్తక పఠనం వల్ల సమకాలిన విషయాలపై విద్యార్థులు విజ్ఞానం పొందవచ్చని గ్రంథాలయాధికారి ఎం.జోగేశ్వరి తెలిపారు. అనంతరం ఆటలు పోటీలు నిర్వహించారు.

విస్తారంగా మిరప పంట సాగు


దాలివలసలో సాగులో ఉన్న మిరపచేను

కె.కోటపాడు : మిరప పంటను మండలంలో పలు గ్రామాల్లో రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. మిరపపంట సాగు కాలంలో 10 రోజులకు ఒక్కోసారి నీటి తడుపు అందించాలని, ఈ విధంగా సాగు చేపడితే మొక్కనాటిన 45 రోజులకు మిరపపంట పూతదశకు చేరుకుని దిగుబడి ప్రారంభం అవుతుందని సాగు రైతులు తెలుపుతున్నారు. తక్కువ పెట్టుబడితో స్వల్పకాలంలో మంచి లాభాలు పొందగలమని రైతులు చెబుతున్నారు. మండలంలో దాలివలస, పింద్రంగి, గవరపాలెం, డి.అగ్రహారం, లంకవానిపాలెం, మర్రివలస, శంగవరం, పాతవలస, కె.సంతపాలెం గ్రామాల్లో 90 ఎకరాల్లో మిరప పంటను సాగు చేస్తున్నారు.

మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ఏర్పాటు


ఉత్సవ కమిటీని అభినందిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజుతో కమిటీ సభ్యులు

మాడుగుల : మాడుగుల మోదకొండమ్మ పండుగ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో బుధవారం సాయంకాలం ఉత్సవ కమిటీని డ్రా పద్ధతిలో ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పల రాజు మాట్లాడారు. డ్రా పద్ధతిలో ఎన్నుకున్న ఉత్సవ కమిటీ రెండేళ్లపాటు కొనసాగుతుందన్నారు. మాడుగుల పట్టణంలో 16 వార్డుల నుంచి వార్డుకు ఒక్కరు చొప్పున 16 మంది సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. నూతనంగా ఎన్నుకోబడ్డ ఉత్సవ కమిటీని ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజుతో పాటు ఇతర కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీకేపాడులో వైద్య శిబిరం


గిరిజనులకు వైద్య పరీక్షలు చేస్తున్న కొత్తకోట పీహెచ్‌సీ వైద్యులు

రావికమతం : చీమలపాడు పంచాయతీ శివారు సీకేపాడులో కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి రజని ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. 52మందికి ఉచితంగా ఆరోగ్య తనిఖీలు చేశారు. జ్వరాలు ఉన్న వారికి రక్త పరీక్షలు చేసి సాధారణ జ్వరాలుగా నిర్ధారించారు. ఉచితంగా మందులు అందచేశారు. వర్షాలు కురుస్తున్నందున పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి నీళ్లు తాగాలని, జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా సమీప పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సర్పంచి వంజరి గంగరాజు, కొత్తకోట పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి రామారావు, హెచ్ఎస్ రమణ, ఏఎన్ఎం క్రిష్ణవేణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం నేడు


సత్యనారాయణపురం కాలనీలో పంచ ముఖ ఆంజనేయ స్వామి

దేవరాపల్లి : పెదనందిపల్లి శివారు సత్యనారాయణపురం కాలనీలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. గురువారం తెల్లవారజాము నుంచి స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు పంచముఖ ఆంజనేయ స్వామి యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన, సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రికి విక్కీదాదా రౌడీ రాజా సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

భారీ వర్షం..రోడ్లు జలమయం


ఏరును తలపిస్తున్న నర్సీపట్నం మెయిన్ రోడ్డు

నర్సీపట్నం : నర్సీపట్నంలో భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. బుధవారం ఉదయం సమయంలో చిరుజల్లులు పడ్డాయి. తరువాత గుబురు ఎండ, ఉక్కపోతతో జనం అల్లాడారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. కురిసిన వర్షానికి జనం ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి పట్టణంలో మెయిన్ రోడ్డుతో పాటు వీధి రోడ్లు సైతం జలమయ్యాయి. కనకదుర్గ ఆలయం, శారదనగర్, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ మెమిన్ రెడ్డుపై వర్షం నీరు ఎరులై పారింది. డ్రెయినేజీలు పొంగి ప్రవహించాయి. మెయిన్ రోడ్డుపై వర్షం నీరు భారీగా చేరడంతో వాహనరాకపోకలకు ఇబ్బందులు తలెత్తింది. కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ఇటీవల కాలంలో ఈ స్థాయిలో వర్షం పడలేదు. ఇదే మొదటిసారి కావడం విశేషం. వరదనీటి ప్రవాహానికి చెత్తా చెదారం రోడ్ల మీదకు కొట్టుకువచ్చింది.

పెద్దేరుకు వరద నీరు ..

మాడుగుల : మండలంలో అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 40 క్యూసెక్కుల వరద నీరు వచ్చి జలాశయంలో చేరుతుందని, జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం జలాశయం గట్టుపై 26 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. జలాశయం గరిష్ట నీటి మట్టం 137 మీటర్లు కాగా 134 మీటర్లకు చేరిందన్నారు. రానున్న ఖరీఫ్ పంటలకు ఢోకా ఉండదని జేఈ తెలిపారు. ఈ ఏడాది ముందుగానే తొలకరి వర్షాలు ప్రారంభమయ్యాయని మెట్టు దుక్కులు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు.


పెద్దేరు జలాశయంలో చేరిన వరద నీరు

మాడుగుల రూరల్: ఉపరితల ఆవర్తన ప్రభావంతో బుధవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. ఖరీఫ్ వరి నారుమడుల తయారీలో రైతులు నిమగ్నులై వున్నారు. ట్రాక్టర్లతో వరినారు మడులు తయారు చేస్తున్నారు. దీంతో పాటు కూరగాయలు, కార్సి చెరకు తోటలకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.


ఎండుతున్న పంటలకు ఊపిరి

బుచ్చెయ్యపేట : మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. వేసవి ఉక్కపోత ఎండ తీవ్రత నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. లోతట్టు ప్రాంతాలతో పాటు రోడ్లపైన వర్షం నీరు చేరింది. ఎండలకు ఎండిపోతున్న సరుగుడు, చెరకు, యూకలిప్టస్, జీడిమామిడి తోటలుతో పాటు మినుము, పెసర, కంది, గంటి, చోడి, నువ్వులు తదితర పప్పుదినుసులు, కూరగాయ పంటలు కురిసిన వర్షంతో ఊపిరి పోసుకున్నాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో చిన్న పిల్లలు, వృద్ధులు, అనారోగంతో బాధ పడుతున్న రోగులు ఉపశమనం పొందారు. రోజంతా వర్షం కురవడంతో ఆరుబైట పనిచేసే రోజువారి కూలీలు అవస్థలు పడ్డారు. రానున్న ఖరీఫ్ ఆకుమడులు దుక్కులకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు తెలిపారు.


మర్రిపాలెం స్కూల్ గేటు ముందు రోడ్డుపై ప్రవహించే నీటిలో ప్రయాణికులతో వెళ్తున్న ఆటో

రోడ్లపైనే వర్షపు నీరు...

నాతవరం: మండలంలో బుధవారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి నీరు రోడ్లపై ప్రవహించింది. నాతవరం, తాండవ జంక్షన్ మధ్య మెయిన్‌రోడ్డుపై నీరు ప్రవహించడంతో వచ్చే పోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాండవ జంక్షన్ మర్రిపాలెం, ములగపూడి, మన్యపురట్ల తాండవ ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డుపై అధికంగా నీరు ప్రవహించింది. అయా ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీలు కూరుకుపోవడంతో నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తుంది. ఈ పరిస్థితి చాలా కాలంగా ఉన్నా వాటిపై అధికారులు కనీసం దృష్టి సారించడం లేదు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. ఈ వర్షం ఖరీఫ్ సీజన్‌లో సాగు కోసం వరి నారుమడులు దుక్కులు తయారు చేసుకునేందుకు ఎంతో ఉపయోగం ఉంటుందని రైతులు అంటున్నారు. తాండవ రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరుగుతుందని ఇరిగేషన్ అధికారులు ఆశిస్తున్నారు. ఈ ఏడాది ఆడపాదడపా వర్షాలు కురుస్తున్నా ప్రాజెక్టులో నీటి మట్టం పెరగకపోవడంతో రైతులు, అధికారులు ఖరీఫ్ సాగుపై దిగాలు చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కురుస్తున్న వర్షాలు ఊరటనిస్తున్నాయి.


వడ్డాదిలో రోడ్డుపై గోతుల్లో చేరిన వర్షం నీరు


బుచ్చెయ్యపేటలో వర్షంతో తేరుకున్న సరుగుడు తోటలు


నాతవరం మెయిన్‌రోడ్డుపై నీటిలో వాహనాల రాకపోకలు